కొనసాగిన 'పది' అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లావ్యాప్తంగా మంగళవారం జరిగిన పదో తరగతి అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో 7470 మంది విద్యార్థులకు 3548 మంది మాత్రమే హాజరయ్యారని, 3922 మంది గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగో రోజు మొత్తం 18 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయగా ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసూ నమోదు కాలేదని, పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు.

అమ్మో.. జూన్..!

హడలిపోతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రయివేటు, కార్పొరేట్ ఫీజులపై ఆందోళన

ఎల్‌కెజికి సైతం రూ.30 వేలకుపైగానే ఖర్చు

ఇంటర్ హాస్టల్ విద్యకు రూ.2.50 లక్షలుపైనే

ఇంజినీరింగ్, ఇతర విద్యలకు రూ.లక్షలు కట్టాల్సిందే

దిక్కుతోచని స్థితిలో సామాన్య ప్రజానీకం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జూన్‌లో నూతన విద్యాసంవత్సరం ప్రారంభమవుతుంది. స్కూళ్ల నుంచి కాలేజీల వరకూ అన్నీ తెరుచుకుంటాయి. పిల్లల చదువుకు సంబంధించిన ఫీజులు, హాస్టల్ ఖర్చులను తలుచుకుని తల్లిదండ్రులు అమ్మో.. జూన్ అంటూ ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో చదువు సామాన్యులకు అందని ద్రాక్షగా మారిపోయింది. ప్రభుత్వం ఇస్తున్న ఫీజు రీయంబర్స్‌మెంట్, అమ్మఒడి వంటివి కంటితుడుపు మాత్రమే. విద్యాసంస్థలు వసూలు చేస్తున్న ఫీజులకు, ప్రభుత్వం అందిస్తున్న సాయానికి సంబంధం లేకుండాపోయింది. దీంతో సామాన్య కుటుంబాలకు పిల్లల చదువులు భారంగా మారాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వెయ్యి వరకూ ప్రయివేటు స్కూళ్లు ఉన్నాయి. వీటిలో ప్రాథమిక పాఠశాలలు 210 ఉండగా, ప్రాథమికోన్నత 493, ఉన్నత పాఠశాలలు 313 వరకూ ఉన్నాయి. వీటిలో దాదాపు మూడు లక్షల మంది విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారు. ప్రస్తుతం ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లలో విద్య పూర్తిగా డబ్బుమయమైంది. ఎల్‌కెజికి సైతం రూ.30 వేలకుపైగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. తరగతులు పెరుగుతున్న కొద్దీ ఫీజుల భారం తడిసి మోపెడవుతోంది. పదో తరగతి విద్యార్థికి ఏడాదికి రూ.లక్ష వరకూ ఖర్చు చేస్తే తప్ప చదువు పూర్తికాని పరిస్థితి నెలకొంది. ఇక హాస్టల్‌లో చేర్పిస్తే ఆ ఖర్చు రెట్టింపవుతోంది. ఇద్దరు పిల్లలు ఉన్న తల్లిదండ్రులు తక్కువగా లెక్కించినా కనీసం ఏడాదికి హైస్కూల్ చదువు నిమిత్తమే రూ.లక్షన్నర నుంచి రూ.రెండు లక్షలు ఖర్చు పెట్టాల్సి వస్తుంది. పుస్తకాలు, యూనిఫారం, రవాణా, ఇతర ఛార్జీల పేరుతో తల్లిదండ్రులను ప్రయివేటు యాజమాన్యాలు పిండేస్తున్నాయి. తల్లిదండ్రులు ఇద్దరూ ఏడాది పొడవునా కష్టపడినా చదువుల కోసం అప్పు చేయక తప్పడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు లేకపోవడంతో తల్లిదండ్రులు తమ పిల్లల చదువు కోసం ప్రయివేటు స్కూళ్లను ఆశ్రయిస్తున్న పరిస్థితి నెలకొంది. ఇదే అదునుగా కార్పొరేట్, ప్రయివేటు స్కూళ్ల దోపిడీకి అడ్డూఅదుపు లేకుండాపోయింది. జూన్ వచ్చిందంటే ప్రతి కుటుంబమూ పిల్లల చదువు కోసం కనీసంగా లెక్కించినా రూ.లక్ష వరకూ ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. దీంతో జూన్ నెల వస్తుందంటే తల్లిదండ్రులు భయపడే పరిస్థితి ఏర్పడింది.

ఉన్నత విద్యకు రూ.లక్షలు వెచ్చించాల్సిందే

ప్రస్తుత పరిస్థితుల్లో అత్యంత ఖరీదైందిగా ఇంటర్ విద్య మారిపోయింది. ఎంసెట్, జెఇఇ మెయిన్స్, అడ్వాన్స్, ఇతర ప్రయివేటు యూనివర్సిటీల్లో సీటు సాధించాలంటే కాంపిటేటివ్ పరీక్షల్లో విద్యార్థులు తమ ప్రతిభ చూపాల్సిందే. లేకపోతే ఇంజినీరింగ్, నీట్ వంటి కోర్సుల చదువుకు సంబంధించి ఉచిత సీటు సాధించడం సాధ్యం కాదు. ఇంటర్ విద్య అత్యంత కీలకంగా మారింది. దీంతో ఇంటర్ విద్య కోసం తల్లిదండ్రులు భారీగా ఖర్చు పెడుతున్న పరిస్థితి ఉంది. డేస్కాలర్‌గా ప్రయివేటులో ఇంటర్ విద్య అభ్యసించాలన్నా ఏడాదికి రూ.లక్ష వరకూ ఖర్చవుతోంది. ఇక హాస్టల్ విద్యార్థిగా చేరితే రూ.రెండు లక్షలు నుంచి రూ.మూడు లక్షల వరకూ ఫీజు చెల్లించాల్సిందే. ఇది తల్లిదండ్రులకు పెనుభారంగా మారింది. ఇంటర్ విద్య పూర్తి చేసి ఇంజినీరింగ్‌లో చేరితే హాస్టల్ ఫీజు రూ.80 వేలుపైనే ఉంటుంది. ఇక వివిధ రకాల ఫీజుల కింద మరో రూ.30 వేలకుపైగా లాగేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే ఫీజు రీయంబర్స్‌మెంట్ కేవలం ట్యూషన్ ఫీజుకు మాత్రమే వర్తిస్తోంది. హాస్టల్, ఇతర ఫీజులన్నీ చెల్లించుకోక తప్పదు. దీంతో ఇంజినీరింగ్ నాలుగేళ్ల కోర్సుకు ఫీజు రీయంబర్స్‌మెంట్ వర్తించిన విద్యార్థికైతే రూ.ఐదు లక్షలు, వర్తించని విద్యార్థులకు రూ.ఎనిమిది నుంచి రూ.పది లక్షలు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. నీట్‌లో ఎంబిబిఎస్ ఉచిత సీటు సాధిస్తే హాస్టల్, ఇతర ఖర్చుల కింద ఏడాదికి రూ.రెండు లక్షలకుపైగా అవుతోంది. ఉచిత సీటు రాకపోతే రూ.25 లక్షలుపైనే ఏడాదికి ఖర్చు పెట్టాల్సి ఉంది. ఉచిత సీటు వస్తే తప్ప ఎంబిబిఎస్ కోర్సుల వైపు సామాన్య విద్యార్థులు చూడలేని పరిస్థితి నెలకొంది. బి.ఫార్మసీ వంటి కోర్సులకు సైతం భారీగా ఖర్చవుతున్న పరిస్థితి నెలకొంది. ఎల్‌కెజి నుంచి ఇంజినీరింగ్ వంటి ఉన్నత చదువుల వరకూ సామాన్య ప్రజానీకానికి మోయలేని భారంగా మారింది. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం పిల్లల చదువుల కోసం అప్పు చేసి రోడ్డున పడుతున్న పరిస్థితి ఉంది. సామాన్య కుటుంబాల పిల్లలకు ఉచితంగా విద్యను ప్రభుత్వం అందించకుండా వదిలేసింది. దీంతో డబ్బు ఉంటేనే చదువు అనే పరిస్థితి తయారైంది. ఫీజులు వసూళ్లపైనే ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడంతో ప్రయివేటు యాజమాన్యాలు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లు పరిస్థితి మారిపోయింది.

కౌంటింగ్‌కు పక్కా ఏర్పాట్లు

జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించిన ఏర్పాట్లను రెండు రోజుల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. స్థానిక సర్ సిఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో వివిధ నియోజకవర్గాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను మంగళవారం జిల్లా ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, డిఆర్‌ఒ డి.పుష్పమణితో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ కౌంటింగ్ హాలులో సిబ్బందికి ఓట్ల లెక్కింపునకు సౌకర్యవంతంగా సీటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. వివిధ రాజకీయ పార్టీల ఏజెంట్లు కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలన్నారు. కౌంటింగ్ హాలులో ప్రతి రౌండ్‌కూ ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయి అనే సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రదర్శించేందుకు వీలుగా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి నియోజకవర్గ కౌంటింగ్ హాలులో అసెంబ్లీ ఓట్లు లెక్కించేందుకు, ఆ నియోజకవర్గంలో ఎంపీ అభ్యర్థికి వచ్చిన ఓట్లు లెక్కించేందుకు వీలుగా విడివిడిగా టేబుల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి నియోజకవర్గం స్ట్రాంగ్‌రూమ్ నుండి కౌంటింగ్ హాలుకు ఇవిఎం, వివిప్యాట్‌లను తీసుకొచ్చేందుకు ప్రత్యేక మార్గం ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్ హాలులోకి అనుమతి లేని ఇతరులు ఎవరికీ ప్రవేశం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ హాలులో పూర్తి ఏర్పాట్లన్నీ రెండు రోజుల్లోగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం వాహనాల పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు. ప్రతి నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు, ఓట్ల లెక్కింపు కోసం సుమారు వెయ్యిమంది సిబ్బందిని నియమిస్తున్నట్లు తెలిపారు. మైక్రోఅబ్జర్వర్లు, కౌంటింగ్ ఏజెంట్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ పూర్తయ్యిందన్నారు. కలెక్టర్ వెంట రిటర్నింగ్ అధికారులు ఎం.ముక్కంటి, కె.భాస్కర్, ఏలూరు మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డి.లక్ష్మీనారాయణ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

నిరంతర నిఘా, పర్యవేక్షణలో స్ట్రాంగ్‌రూమ్‌లు

ఇవిఎంలను అత్యంత భద్రతా ఏర్పాట్లతో స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపర్చి నిరంతర నిఘాలో ఉంచామని జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ తెలిపారు. మంగళవారం స్థానిక సిఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లను జిల్లా ఎస్‌పి డి.మేరీప్రశాంతి, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణితో కలిసి ఆయన పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌ల సీళ్లను పరిశీలించి సంబంధిత రిజిస్టర్లలో వారు సంతకం చేశారు. దెందులూరు నియోజకవర్గ స్ట్రాంగ్‌రూమ్ వద్ద భద్రతను జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి అధికారులతో పరిశీలించి సందర్శకుల రిజిస్టర్‌లో సంతకం చేశారు.

ప్రభుత్వ భూములు పేదలకు పంచాలి

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

జిల్లాలోని ప్రభుత్వ భూములు పేదలకు పంచాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులను డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలోని 16 రకాల ప్రభుత్వ భూములు నాలుగు లక్షల ఎకరాలు ఉన్నాయని, ఈ భూములను భూస్వాములు ఆక్రమించుకుని సాగు చేస్తున్నారన్నారు. వెంటనే ఈ భూములను పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. మండలంలోని ఎర్రకాలువ ప్రాజెక్ట్ మిగులు భూములు పంగిడిగూడెం, కేతవరం, గురవాయిగూడెం ల్యాండ్ సీలింగ్ భూములు, టి.నర్సాపురం మంగళిమెట్ట రావమ్మగూడెం ఏజెన్సీలో గిరిజనులు సాగు చేస్తున్న ఎల్‌టిఆర్ పోడు భూములు, దోసపాడు 400 ఎకరాల ల్యాండ్ సీలింగ్ భూములు ఇలా జిల్లామొత్తంగా భూపోరాటాలు సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. పోరాట సందర్భంలో పేదలు భూముల్లో సాగు చేసి పంటలు వేయగా రెవెన్యూ అధికారులు భూస్వాములతో కుమ్మక్కై, పేదలపై అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మాట్లాడుతున్న వి.వెంకటేశ్వర్లు

సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం సంఘం పోరాటాల ఫలితంగా వచ్చిందని, ఈ చట్టం అమలులో ఉపాధి హామీ అధికారులు విఫలమవుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికే రావాల్సిన వేతన బకాయిలు కోట్లాది రూపాయలు ఉండగా విడుదల చేయకుండా అధికారులు మొద్దునిద్ర నటిస్తున్నారని, పేస్లిప్‌లు ఇవ్వకుండా కూలీల డబ్బు అధికారులు స్వాహా చేస్తున్నారని ఆరోపించారు. పేదలు పట్టెడు అన్నం తింటున్నారంటే ఈ ఉపాధి హామీ చట్టమే కారణమని గుర్తు చేశారు. జంగారెడ్డిగూడెం మండలంలోని ఎ.పోలవరంలో చెరువులో ఉపాధి పనుల స్థానంలో జెసిబి యంత్రాలతో రాత్రుళ్లు మట్టి తోలకాలు సాగిస్తున్నారని, ఇంత అన్యాయం జరుగుతుంటే బాధితులపై చర్యలు తీసుకోకుండా ఎంపిడిఒ, ఎపిఒ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తక్షణమే అక్రమంగా మట్టి తోలుతున్న భూస్వాములపై చర్యలు తీసుకోవాలని కోరారు. కూలీలకు మజ్జిగ, తాగునీరు, టెంట్లు, సమ్మర్ అలవెన్స్,కనీస సౌకర్యాలు కల్పించాలని, పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా 200 రోజులు పనులు చూపి రూ.600 వేతనం ఇవ్వాలని కోరారు. ఈ అంశాలపై ఈ సమావేశంలో చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. తక్షణమే ఈ సమస్యలపై జిల్లా కలెక్టర్, రెవెన్యూ, ఉపాధి హామీ అధికారులు సమగ్రంగా పరిశీలించి కూలీలకు, పేదలకు తగిన న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భూమి, కూలీ, ఉపాధి హామీ చట్టం పరిరక్షణకై పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నేతలు తామా ముత్యాలమ్మ, వై.నాగేంద్రరావు, ఆర్.డానియేలు, వి.వెంకటేష్, ఎస్.మహంకాళి, ఎ.ప్రభాకర్‌రావు, వై.సీత, ఎస్.కోటేశ్వరరావు, హోలీ మేరీ, కె.దుర్గ, ఎస్.సాయికృష్ణ, పిల్లి చంటి తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి ఎన్‌టిఆర్

101వ జయంతి సందర్భంగా ఘన నివాళులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో పార్టీని స్థాపించి, ఆనతికాలంలోనే అధికారాన్ని చేపట్టి ఖ్యాతిని గడించి, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం పాటుపడిన మహోన్నత వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అని టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, దెందులూరు ఎంఎల్‌ఎ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్, ఏలూరు ఎంఎల్‌ఎ అభ్యర్థి బడేటి చంటి కొనియాడారు. ఎన్‌టిఆర్ 101వ జయంతి వేడుకలను టిడిపి శ్రేణులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏలూరులోని టిడిపి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో భాగంగా తొలుత ఎన్‌టిఆర్ విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి, అనంతరం కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ పార్టీ స్థాపించిన ఆనతికాలంలోనే అధికారం చేపట్టిన ఘనత ఎన్‌టిఆర్‌కె దక్కుతుందన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారన్నారు. చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ స్థాపించి, ఎంతోమందికి రాజకీయ జన్మనిచ్చారని, పేదవారికి అండగా ఉండడమే పార్టీ సిద్ధాంతంగా పని చేశారన్నారు. బడేటి చంటి మాట్లాడుతూ ఎన్‌టిఆర్ ఆశయాలతో ఎన్నికల్లో కార్యకర్తలంతా సమిష్టిగా పని చేశారని, 1983 ఫలితాలు 2024లో పునరావృతం కాబోతున్నాయని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మరడాని రంగారావు, ఉప్పాల జగదీష్‌బాబు, ఎంఆర్‌డి.బలరాం, చోడే వెంకటరత్నం, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నేతలు

ముదినేపల్లి నుంచే సీతాదేవి ప్రస్థానం

నేడు కొండూరులో అంత్యక్రియలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, పూర్వపు ముదినేపల్లి అసెంబ్లీ నియోజకవర్గ మాజీ ఎంఎల్‌ఎ ఎర్నేని సీతాదేవి జీవన, రాజకీయ ప్రస్థానం ముదినేపల్లి నియోజకవర్గం నుంచే ప్రారంభమైంది. గుండెపోటుతో మరణించిన సీతాదేవికి ముదినేపల్లితో విడదీయరాని అనుబంధం ఉంది. ఆమె పుట్టినిల్లు ముదినేపల్లి మండలం గురజ గ్రామం కావడంతో సీతాదేవికి ఈ ప్రాంతంతోనే ఎక్కువ అనుబంధం ఏర్పడింది. ఆమె కైకలూరు నియోజకవర్గంలోని కలిదిండి మండలం కొండూరు గ్రామంలో నివసిస్తున్నప్పటికీ ముదినేపల్లి నియోజకవర్గ టిడిపి నాయకులతోనే ఎక్కువగా రాజకీయ సంబంధాలు ఉండేవి. ఉన్నత విద్యావంతురాలు అయిన సీతాదేవికి కొండూరుకు చెందిన సమీప బంధువైన రాష్ట్ర రైతాంగ సమాఖ్య నాయకుడు ఎర్నేని నాగేంద్రనాథ్‌తో వివాహమైంది. ఎన్‌టిఆర్ పిలుపు మేరకు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ సమయంలో సీతాదేవి రాజకీయ అరంగేట్రం చేశారు. ముదినేపల్లి అసెంబ్లీ నియోజకవర్గ రాజకీయాల్లో తొలి మహిళ నేతగా సీతాదేవి కాలు మోపారు. తొలిసారిగా సీనియర్ రాజకీయవేత్త, కృష్ణా జెడ్‌పి ఛైర్మన్‌గా పని చేసిన కీర్తిశేషులు పిన్నమనేని కోటేశ్వరరావుపై 1983లో టిడిపి తరపున పోటీ చేసి ఓటమి పాలైనప్పటికీ తర్వాత జరిగిన ఎన్నికల్లో కోనేరు రంగారావుపై విజయం సాధించి ఎన్‌టిఆర్ మంత్రివర్గంలో ఉన్నత విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. 2004 వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ముదినేపల్లి నియోజకవర్గం నుంచి మహిళా ఎంఎల్‌ఎగా సీతాదేవి ఒక్కరే పని చేశారు. ఆమె భర్త ఎర్నేని నాగేంద్రనాథ్ మరణించి ఏడాది కాకుండానే సీతాదేవి కన్ను మూయడంతో ముదినేపల్లి మండల ప్రజలు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

సీతాదేవి హయాంలో నిర్మించిన ముదినేపల్లి బస్టాండ్

ముదినేపల్లి అభివృద్ధిలో సీతాదేవి ముద్ర

ముదినేపల్లి మండల అభివృద్ధిలో మాజీ మంత్రి సీతాదేవి తనదైన ముద్ర వేశారు. తన పుట్టిన గ్రామం మండలంలోని గురజ కావడంతో ఈ మండలంపై ఆమె ప్రత్యేక ప్రేమను కనబరిచారు. ఉన్నత విద్యా శాఖ మంత్రిగా పనిచేసిన కాలంలో మండలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ప్రధానంగా ప్రభుత్వ బాలికల వసతి గృహం, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆర్‌టిసి బస్టాండ్ నిర్మాణంతోపాటు, ముదినేపల్లి-ఏలూరుపాడు రోడ్డు విస్తరణ, పలు పంట కాలువలు, డ్రెయిన్లపై వంతెనల నిర్మాణం, ఇతర ప్రభుత్వ కార్యాలయాల భవనాల నిర్మాణం వంటి పలు అభివృద్ధి పనులను ఆమె నిర్వహించారు.

సీతాదేవి మృతి టిడిపికి తీరని లోటు

మాజీ మంత్రి ఎర్నేని సీతాదేవి మృతి టిడిపికి తీరని లోటు అని టిడిపి నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, మాజీ ఎంపిపి ఎర్నేని లక్ష్మణ ప్రసాద్, నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌ఛార్జి కొడాలి వినోద్ అన్నారు. కొండూరులోని ఆమె నివాసంలో సీతాదేవి భౌతికకాయానికి మంగళవారం నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ముదినేపల్లిలో మాట్లాడుతూ పార్టీ పెద్ద దిక్కును కోల్పోవడం బాధాకరమన్నారు. నివాళులర్పించిన వారిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొత్త నాగేంద్ర కుమార్, మండల అధ్యక్షులు శోభనాద్రి చౌదరి, మండల ప్రధాన కార్యదర్శి బొంగు రవికుమార్, నాయకులు ఎర్నేని కిషోర్, వీరమల్లు సత్యనారాయణ, కొత్తూరి విఠల్, బి.సుందరరామయ్య, కె.శేషుబాబు, పరసా ఏడుకొండలు, ఎల్.భాను ప్రసాద్, ఈడుపుగంటి శ్రీనివాస్, దావు నాగరాజు, జాస్తి రాజా, ఎర్ర రాంబాబు, బండి సత్యనారాయణ, ఈడే సుధాకర్ ఉన్నారు.

నేడు అంత్యక్రియలు..

కలిదిండి: మాజీ మంత్రి ఎర్నేని సీతాదేవి (74) అంత్యక్రియలు మండలంలోని కొండూరులో బుధవారం నిర్వహించనున్నారు. ఆమె హైదరాబాదులో సోమవారం తెల్లవారుజామున మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆమె భౌతికకాయాన్ని స్వగ్రామమైన మండలంలోని కొండూరు గ్రామానికి మంగళవారం తెల్లవారుజామున తీసుకొచ్చారు. నాయకులు కమ్మిలి విఠల్, తాడినాడ బాబు, కామినేని శ్రీనివాసరావు, టిడిపి నాయకులు, అభిమానులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. గతేడాది మరణించిన ఆమె భర్త రైతాంగ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఎర్నేని నాగేంద్రనాథ్ పుట్టిన రోజు మంగళవారం కావడంతో సీతాదేవి అంత్యక్రియలు బుధవారం నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు.

హింసాత్మక చర్యలకు పాల్పడితే చర్యలు

డిఐజి జివిజి అశోక్‌కుమార్

ప్రజాశక్తి - ఆచంట

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు, హింసాత్మక చర్యలకు పాల్పడిన వారిపై ఉక్కుపాదం తప్పదని ఏలూరు రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జివిజి.అశోక్‌కుమార్ హెచ్చరించారు. మంగళ వారం సాయంత్రం ఆయన ఆచంట పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ విధ్వంసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు పోలీసులు నిత్యం అప్రమత్తంగా ఉంటారని, అల్లర్లు, గొడవలు విధ్వంసం సృష్టించేందుకు ప్రయత్నిస్తే కఠినంగా వ్యవహరిస్తూ తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ రోజు జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రతిష్టమైన భద్రతా చర్యలు చేపట్టామన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన రాజకీయ పార్టీల నాయకులు బాణసంచా కాల్చడం, ర్యాలీలు చేపట్టడం, ఉత్సవాలు, సభలు సమావేశాలు ఏర్పాటు చేసేందుకు అనుమతులు లేవని ఆయన స్పష్టం చేశారు. 144 సెక్షన్ అమల్లో ఉన్న నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వచ్చే వరకూ ఎక్కడా ఎటువంటి గొడవలు జరగకుండా ఉండేందుకు పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు కూడా పోలీసు అంతరంగానికి సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కెవి.భీమారావు, నరసాపురం డిఎస్‌పి జి.శ్రీనివాసరావు, పెనుగొండ సిఐ రజినీ కుమార్, ఎస్ఐలు ఎం.రాజ్‌కుమార్, పి.రవీంద్రబాబు, షేక్ సుభాని పాల్గొన్నారు.

కౌంటింగ్ సెంటర్ వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న అశోక్‌కుమార్

భీమవరం టౌన్ : స్ట్రాంగ్ రూముల వద్ద ప్రతిష్టమైన భద్రతతో పాటు కౌంటింగ్ రోజున ఎటువంటి అసాంఘిక ఘటనలు, గొడవలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిఐజి జివిజి అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం భీమవరంలోని ఎస్ఆర్ కెఆర్, విష్ణు ఇంజినీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్ రూముల భద్రత, ఓట్ల లెక్కింపు కేంద్రాల ఏర్పాట్లను డిఐజి జివిజి అశోక్ కుమార్, ఎస్‌పి వి అజితతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడారు. భీమవరంపై డ్రోన్లు ఎగిరేందుకు సిద్ధం అవుతున్నాయని తెలిపారు. ఓట్ల లెక్కింపు రోజున ఎటువంటి హింసాత్మక సంఘటనలు జరగకుండా పోలీస్ యంత్రాంగం డ్రోన్లు ప్రయోగించనున్నారు. మరోవైపు ఎక్కడికక్కడ సీసీ కెమెరాలతో నిఘా పెడుతున్నారన్నారు. భీమవరంలో పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉందని, కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించడం, ఎటువంటి అల్లర్లు జరగకుండా చూడటం కోసం ఇప్పటికే పలు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కౌంటింగ్ రోజున 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందన్నారు. అల్లర్లు, హింసాత్మక సంఘటనలకు పాల్పడే వ్యక్తులను గుర్తించేందుకు డ్రోన్లు వినియోగించనున్నామని, సీసీ కెమెరాలు ఎక్కడికక్కడ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గాల వారీగా కౌంటింగ్ కేంద్రాల్లోకి వెళ్లే మార్గాల వద్ద ఏర్పాటు చేసిన దిక్సూచి బోర్డులు స్పష్టంగా ఏర్పాటు చేయాలని, కౌంటింగ్ కేంద్రాల్లో వీడియో గ్రఫీ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. కౌంటింగ్ రోజున కేంద్రాల ప్రవేశ ద్వారాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లకు సంబంధిత అధికారుల నుంచి గుర్తింపు కార్డులు జారీ చేయడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ కేంద్రాలైన రెండు కాలేజీల ప్రహరీ నుంచి 100 మీటర్ల దూరంలో బ్యారికేడ్లు ఏర్పాటు చేసుకొని తగిన బందోబస్తు ఉంచాలన్నారు. అక్కడ నుంచి ఏ ఒక్క వాహనం అనుమతించరాదని అధికారులకు పలు సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఎస్‌పి కోరారు. వారి వెంట అడిషనల్ ఎస్‌పి (అడ్మిన్) వి.భీమారావు, డిఎస్‌పి వి.నారాయణస్వామి రెడ్డి, జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ డిఎస్‌పి ఎం.సత్యనారాయణ, దిశా డిఎస్‌పి మురళీకృష్ణ పాల్గొన్నారు.

పాఠశాలలు తెరిచే నాటికే పాఠ్యపుస్తకాలు

ఆర్‌జెడి జి.నాగమణి

ప్రజాశక్తి - భీమడోలు

పాఠశాలలు పునః ప్రారంభమయ్యే సమయానికి విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు అందజేసేందుకు తగు ప్రణాళికలు రూపొందించుకోవాలని విద్యాశాఖ కాకినాడ ఆర్‌జెడి జి.నాగమణి కోరారు. భీమడోలు హైస్కూల్లో ఏర్పాటు చేసిన మండల విద్యా కానుకల స్టాక్ పాయింట్‌ను మంగళవారం సాయంత్రం ఆమె తనిఖీ చేశారు. వివిధ అంశాలను పరిశీలించారు. ఇప్పటివరకు చేరిన పాఠ్యపుస్తకాలు, రావాల్సిన పాఠ్య పుస్తకాలు, ఇతర విద్యా కానుకల వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. రావలసిన ఇతర విద్యా కానుకలు త్వరలో అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎంఇఒ భాస్కర్ కుమార్ మాట్లాడుతూ ఇంతవరకు మండల పరిధిలో 8, 9, 10వ తరగతుల పాఠ్యపుస్తకాలలో ఫిజికల్ సైన్స్ మినహా ఇతర పుస్తకాలు చేరాయని తెలిపారు. ఒకటి రెండో తరగతుల పాఠ్య పుస్తకాలు వచ్చాయని, మూడు, నాలుగు తరగతుల పుస్తకాలు రావాల్సి ఉందని చెప్పారు. కార్యక్రమంలో సిఆర్‌పిలు శర్మ, రాధాకృష్ణ, రమణ పాల్గొన్నారు.

పుస్తకాలను పరిశీలిస్తున్న ఆర్‌జెడి నాగమణి

ఉపాధి హామీ పనులు అడ్డగింత

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని యర్రంపేట పరిధిలో ఎర్ర కాడి ప్రాంతంలో చేపట్టిన ఉపాధి హామీ పనుల్లో ఉద్రిక్తత నెలకొంది. ఆ ప్రాంతంలో సర్వే నెంబర్ 180, 181లలో అమృత్ సరోవర్ కార్యక్రమంలో భాగంగా ఎకరం భూమిని అభివృద్ధి చేయడానికి అధికారులు ప్రతిపాదించారు. దీనిలో భాగంగా ఆ భూమిలో యర్రంపేటకు చెందిన కూలీలు ఉపాధి హామీ చట్టం కింద పూడిక తీత పనులకు సిద్ధమయ్యారు. కాగా ఆ సర్వే నెంబర్లలో ఉన్న సుమారు 12 ఎకరాల పోరంబోకు భూమిని ఐదు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్నామని, ఇప్పుడొచ్చి ఆ భూమిని చెరువు చేస్తామంటే ఒప్పుకునేది లేదని రాజవరం గ్రామానికి చెందిన కొందరు అభ్యంతరం వ్యక్తం చేస్తూ పనులను అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఉపాధి కూలీలు నీడ కోసం వేసుకున్న పందిరి తొలగించారు. పనులు జరుగుతున్న ప్రాంతంలో బైఠాయించారు. సమాచారం అందుకున్న ఉపాధి హామీ చట్టం మండల స్థాయి అధికారులు చేరుకుని వారితో మాట్లాడినప్పటికీ ఎలాంటి ఉపయోగం లేదు.

ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని ఎంఇఒ కిరణ్‌బాబు అన్నారు. పట్టణంలోని ఎంఇఒ కార్యాలయం వద్ద మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే మధ్యాహ్న భోజనం కార్మికులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం మెనూ ఉన్న ప్రకారంగా విద్యార్థులకు ఉత్తమమైన భోజనం ఏ విధంగా వండి పెట్టాలని అనేదానిపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ రామారావు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు..

ఆగిరిపల్లి : విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని అందించే విధంగా మండల పరిధిలోని అన్ని పాఠశాలల మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులు కృషి చేయాలని ఎంఇఒ-2 కె.ఆనంద్‌కుమార్ కోరారు. ఆగిరిపల్లి కొండకాలనీ ఎంపిపి పాఠశాలలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు చిల్లి జ్యోతి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 50 పాఠశాలలకు చెందిన మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన

ప్రజాశక్తి - మండవల్లి

బాలికలు బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకొని ఆరోగ్యవంతంగా ఉండాలని సూపర్‌వైజర్ వెంకట నాగలక్ష్మి తెలిపారు. స్టేషన్ రోడ్డులోని అంగన్వాడీ కేంద్రం-1లో ఆరు అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో మాసిక మహోత్సవంలో భాగంగా కిశోర బాలికలకు మంగళవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకటనాగలక్ష్మి మాట్లాడుతూ కిశోర బాలికలు బలవర్ధకమైన ఆహారం తీసుకోకపోతే తల్లి అయిన సమయంలో అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో చైతన్య ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు సరస్వతి, సుధారాణి, ఉమాదేవి, శ్రీదేవి, నాగలక్ష్మి, జయలక్ష్మి, ఎఎన్ఎం కనకదుర్గ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : కొయ్యలగూడెం పరిధిలోని కళింగపేట అంగన్వాడీ సెంటర్‌లో మాసిక మాసోత్సవం కార్యక్రమం నిర్వహించారు. కిశోర బాలికలు రుతుక్రమంలో వాడే ఉత్పత్తుల గురించి వివరించారు. పరిశుభ్రత, బాల్య వివాహాలు, రుతుక్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం, విద్య, దిశా, పోక్సో చట్టం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ విషయాల గురించి కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి స్వర్ణకుమారి, సెక్టర్ సూపర్‌వైజర్ రాణి, హెల్త్ సిబ్బంది హేమ, ఎఎన్ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీలు, కిశోర బాలికలు, తల్లులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : ప్రత్యేక అవసరాలు గల బాల, బాలికలను అంగన్వాడీ కార్యకర్తలు తమ సెంటర్ పరిధిలో గుర్తించి వారిని భవిత సెంటర్‌లో చేర్పించాలని ఐసిడిఎస్ ఆగిరిపల్లి సెక్టార్ అంగన్వాడీ సూపర్‌వైజర్ జి.రాగమయి కోరారు. ఆగిరిపల్లి అంగన్వాడీ సెంటర్-1లో నిర్వహించిన సమావేశంలో ఆగిరిపల్లి మండల విద్యాశాఖాధికారి-2 కె.ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ జూన్ తొమ్మిదో తేదీ వరకు మండల పరిధిలో జరుగుతున్న ప్రత్యేక అవసరాలు గల పిల్లల నమోదు కార్యక్రమానికి అంగన్వాడీ కార్యకర్తలు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఇఆర్‌పిలు కె.ఝాన్సీరాణి, బి.రజని, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టి.నరసాపురం : కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని టి.నరసాపురం సెక్టార్ ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎం.లక్ష్మి సూచించారు. మండలకేంద్రమైన టి.నరసాపురం పంచాయతీలోని తూర్పుగూడెం అంగన్వాడీ కేంద్రంలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పీరియడ్ ఫెస్టివల్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన లక్ష్మి మాట్లాడుతూ పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం సత్యవతి, ఎంఎస్‌కె.మాధవి, అంగన్వాడీ కార్యకర్తలు ఝాన్సీ, పద్మ, శాంత కుమారి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

భీమడోలు : కిశోర బాలికలు ఆరోగ్య పరిరక్షణలో భాగంగా పరిశుభ్రత పాటించటం పట్ల అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ భీమడోలు ప్రాజెక్ట్ అధికారి కె.విజయలక్ష్మి కోరారు. భీమడోలు ప్రాజెక్టు పరిధిలో గుండుగొలను కేంద్రంగా మాసిక మహోత్సవం ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సుకు గుండుగొలను సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.కవిత అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన భీమడోలు ప్రాజెక్టు అధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళలు బుతుక్రమం పట్ల అపోహలు వీడాలని, నిషేధాలను పాటించాల్సిన అవసరం లేదని తెలిపారు. కిశోర బాలికలకు పౌష్టికాహారం అందించేందుకు ఐసిడిఎస్ అందిస్తున్న సహాయ సహకారాలు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రాజమణి, విజయలక్ష్మి, పద్మా కుమారి పాల్గొన్నారు.

ఎన్‌సిసి విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి - ముసునూరు

పట్టణంలోని రాజీవ్ గాంధీ సాంకేతిక వైజ్ఞానిక విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న ట్రిపుల్ ఐటి కళాశాల ఆవరణలో 17ఎ బెటాలియన్ ఎన్‌సిసి విజయవాడ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు శిబిరం నిర్వహిస్తున్నారు. కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ సురేంద్ర ఆధ్వర్యంలోయాన్యువల్ ట్రైనింగ్ క్యాంపు (ఎటిసి) ఉత్సాహభరితంగా కొన సాగుతోంది. ఇందులో భాగంగా విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలో ఎన్‌సిసి విద్యార్థులకు మంగళవారం క్యాంపు నిర్వహించారు. విపత్తుల సమయంలో ప్రజలను రక్షించడం, అగ్ని ప్రమాదాల సమయంలో వ్యవహరించే తీరు, ఆర్మీ కెరియర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎన్‌సిసి శిక్షణ శిబిరానికి 12 పాఠశాలల నుంచి 328 మంది , ఎనిమిది కళాశాలల నుంచి 239 మంది మొత్తంగా 567 మంది విద్యార్థులు క్యాంపులో శిక్షణ పొందుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నరసింహరావుకు కృష్ణప్రసాద్ పరామర్శ

ప్రజాశక్తి - కలిదిండి

అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి సీనియర్ నాయకులు పోకల నరసింహరావును టిడిపి పెడన ఎంఎల్ఎ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ మంగళవారం పరామర్శించారు. మండలంలోని భాస్కరరావుపేటలోని నరసింహరావు నివాసానికి కృష్ణప్రసాద్ చేరుకుని పరామర్శించారు. కుమారులు పోకల జోగిరాజు, దుర్గాప్రసాద్‌లను నరసింహరావు ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు, కృత్తివెన్ను మండల ప్రధాన కార్యదర్శి రత్తయ్య, మంతెన సుబ్బరాజు ఉన్నారు.

నేరాలు - ఘోరాలు

దాడి చేశాడని వ్యక్తిపై మహిళ ఫిర్యాదు

ప్రజాశక్తి - ముసునూరు

తనపై తన భర్తపై ఓ వ్యక్తి దాడి చేశాడని చింతలవల్లి శివారు గోగులంపాడుకు చెందిన ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోగులంపాడుకు చెందిన రాజుబోయిన వెంకట శ్రీనివాసరావు, సూరేపల్లి గ్రామానికి గుండ్రు చందు ఇద్దరు స్నేహితులు. వీరిద్దరు కలిసి ఈ నెల పదో తేదీన శ్రీనివాసరా వుకు చెందిన బైక్‌పై తిరిగారు. ఈ క్రమంలో బైక్‌లో ఉన్న గడ్డి కోసే కత్తి కనిపిం చడంలేదని శ్రీనివాసరావు భార్య లక్ష్మి చందును అడుగుతూ వస్తుంది. చందు ఆమెతో దుర్భాషలాడుతూ గొడవ పడుతూ ఉంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం కూడా కత్తి గురించి అడగగా తనపై, తన భర్తపై చందు దాడి చేశాడని లక్ష్మి ముసునూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

భారతి విద్యానికేతన్‌తో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

ప్రిన్సిపల్ శౌరి, కరస్పాండెంట్ విజయలక్ష్మి


ప్రిన్సిపల్ శౌరి


కరస్పాండెంట్ విజయలక్ష్మి

భారతి విద్యానికేతన్ స్కూల్

ప్రజాశక్తి - ముసునూరు

విద్యారంగంలో 31 ఏళ్ల అనుభవం కలిగిన ఏకైక సంస్థ భారతి విద్యానికేతన్ హైస్కూల్ అని ప్రిన్సిపల్ కొండేటి శౌరి, కరస్పాండెంట్ విజయలక్ష్మి చెప్పారు. ఈ సందర్భంగా వారు ప్రజాశక్తితో మాట్లాడారు. అనుభవం ఉన్న ఉపాధ్యాయులతో విద్యాబోధన చేస్తున్నామన్నారు. అన్ని సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని చెప్పారు. కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రాథమిక విద్య నుంచే సైన్స్, కొన్ని ప్రాజెక్టు పనుల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించేవిధంగా కృషి చేస్తున్నామన్నారు. కమ్యూనికేషన్స్ స్కిల్స్, పర్సనాలిటి డెవలప్‌మెంట్ విధానం కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. వ్యాసరచన, ఉపన్యాసం, చిత్రలేఖనంలో శిక్షణ ఇస్తున్నామన్నారు. డ్యాన్స్, పాటలతో కూడిన విద్యాబోధనాంశాలతో మంచి ప్రాముఖ్యత సంపాదించిన పాఠశాలగా భారతి విద్యానికేతన్ హైస్కూల్‌కు ముసునూరు మండలంలోని 16 గ్రామాల్లో మంచి గుర్తింపు ఉందన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యా సంస్థ భారతి విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థులు నవోదయ ప్రవేశ పరీక్షలో మంచి ప్రతిభ కనబరిచారన్నారు. 2022లో గోగం చందు వెంకట ఆదిత్య, 2023లో హరిహరనాథ్ సింగ్, 2024లో జి.కోమలేశ్వరి మంచి మార్కులు సాధించి నవోదయలో సీటు సాధించి తమ పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చారన్నారు. అలాగే గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలో కూడా నూటికి నూరు శాతం దరఖాస్తు చేసుకున్న వారు అర్హత సాధించి విజయం సాధించారన్నారు. పదో తరగతి పరీక్షల ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతి ఏడాది నూటికి నూరు శాతం విజయం సాధించి మంచి ప్రవీణ్యత కనబరుస్తున్నారన్నారు. 2023-2024 విద్యా సంవత్సరంలో ఏరుగంటి మాధురీలత 415 మార్కులు సాధించి పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. జాతీయ సైన్సు దినోత్సవం వేడుకల్లో తమ విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు ఉన్నతాధికారులు పరిశీలించి విద్యార్థులను అభినందించారని తెలిపారు. స్వాతంత్ర దినోత్సవం, గణతంత్ర దినోత్సవం వేడుకల్లో జెండా వందన కార్యక్రమాల్లో ప్రత్యేకత చాటారన్నారు. దేశ నాయకుల వేషధారణాలతో అభినయం చేస్తారిన చెప్పారను. క్రిస్మస్ వేడుకల్లో, సంక్రాంతి పండుగ సంబరాల్లో పాల్గొంటారని తెలిపారు. అతి తక్కువ ఫీజులతో కార్పొరేట్ స్థాయి విద్యను అందించడం భారతి విద్యానికేతన్‌కే దక్కుతుందని తెలిపారు.

పేద విద్యార్థుల విద్యాభివృద్ధే లక్ష్యం

మండవల్లి జెడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పివిఎస్ఎస్‌సి.ప్రసాద్

మండవల్లి జిల్లా పరిషత్ హైస్కూల్

హెచ్ఎం ప్రసాద్

ప్రజాశక్తి - మండవల్లి

పేద విద్యార్థుల విద్యాభివృద్ధి లక్ష్యంగా అంకితభవంతో విద్యాబోధన చేస్తున్నామని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పివిఎస్ఎస్‌సి.ప్రసాద్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. దాతల సాయంతో స్థలం సేకరించి సుమారు 1948లో జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ప్రారంభించామని, 1960లో పదో తరగతిని ప్రారంభించి ఎబిసిడి నాలుగు సెక్షన్లుగా ఏర్పాటు చేసి విద్యాబోధన చేస్తున్నామన్నారు. జిల్లా పరిషత్ హైస్కూల్లో చదువుకున్న ఎంతోమంది ఉన్నత శిఖరాలకు చేరుకున్నారన్నారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యలో వెనుకబడిన వారిని గుర్తించి ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. దీంతో 2022-23 విద్యా సంవత్సరంలో జశ్వంత్‌సాయి 582 మార్కులతో కైకలూరు నియోజకవర్గంలో ద్వితీయస్థానంలో నిలిచి ట్రిపుల్ ఐటిలో సీటు సాధించాడన్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో సాయిశ్రీ 578 మార్కులు సాధించి మండల ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. పాఠశాలలో ఆహ్లాదకరమైన వాతావరణంలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు ఏర్పాటుతో క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన చేస్తున్నామన్నారు. పది డిజిటల్ తరగతి గదులను, స్మార్ట్ టివిలతో మరో రెండు తరగతి గదులను, 8, 9 విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చిన ట్యాబులతో బైజుస్ కంటెంట్ ద్వారా పూర్తిస్థాయిలో డిజిటల్ పద్ధతిలో విద్యాబోధన చేస్తున్నామన్నారు. దీంతో హైస్కూల్లో విద్యార్థుల హాజరు శాతం రెట్టింపవుతూ వస్తుందన్నారు. అంతేకాకుండా సైన్స్ ప్రయోగాల్లో కూడా పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయిలో పోటీ పడ్డారని తెలిపారు. నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఇరువురు విద్యార్థులు ఎంపికయ్యారని, కబాడ్డీ, వాలీబాల్ పోటీల్లో బాలికలు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ఆడేందుకు ఎంపికయ్యారని తెలిపారు.

పాఠశాల పిఎంఎస్ఆర్ఐకి ఎంపిక

మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రైమ్ మినిస్టర్ స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియాకు ఎంపికైందని తెలిపారు. దీంతో పాఠశాలలో కెమిస్ట్రీ, ఫిజిక్స్ ల్యాబ్ నిర్మాణం చేసుకోవడానికి అనుమతులు రావడంతో ఏర్పాటు కానున్నాయన్నారు. అంతేకాకుండా బ్యాడ్మింటన్, షటిల్, వాలీబాల్ కోర్టుల ఏర్పాటుకు కూడా అనుమతులు వచ్చాయని, ఇప్పటికే కెమిస్ట్రీ ల్యాబ్ నిర్మాణం ప్రారంభించడంతో పాటు ఆట స్థలాల్లో పిచ్చి మొక్కలు తొలగించి నేలను పూర్తిస్థాయిలో చదును చేసినట్లు తెలిపారు. వాటిని 2024-25 విద్యా సంవత్సరంలో పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.

దాతల సాయంతో మరింత అభివృద్ధి

మండవల్లి ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతల సహాయం ఎంతో ఉందన్నారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన, ఆటల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహాలు అందించడంతోపాటు విద్యార్థులకు అవసరమయ్యే నోట్ పుస్తకాలను కూడా దాతలు అందిస్తున్నారన్నారు. పూర్వ విద్యార్థులు పాఠశాలలో భోజనశాలతో పాటు ఆర్ఒ ప్లాంట్‌ను నిర్మించారని చెప్పారు. అయితే భోజనశాలలో పక్షులు చేరడంతో విద్యార్థులు భోజనం చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారని, ఆర్ఒ ప్లాంట్ మరమ్మతులకు నోచుకుందని మానవత స్వచ్ఛంద సంస్థ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. వారు స్పందించి సుమారు రూ.3.50 లక్షలతో భోజనశాలకు చుట్టూ ఇనుప మెష్ ఏర్పాటు చేయడంతో పాటు పూర్తిస్థాయిలో ఆర్ఒ ప్లాంట్‌కు మరమ్మతులు చేసినట్లు చెప్పారు. పాఠశాల పున:ప్రారంభానికి అందుబాటులోకి తీసుకొచ్చి విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామన్నారు. పాఠశాలలో వేదిక లేదని సమావేశాలు నిర్వహించుకోవడానికి ఇబ్బందిగా ఉందని తెలపడంతో గ్రామానికి చెందిన కైకలూరు మార్కెట్ యార్డ్ కమిటీ ఛైర్మన్, గ్రామ ప్రముఖులు చేబోయిన వీర్రాజు వేదికను నిర్మించేందుకు ముందుకు వచ్చారన్నారు.

అంకితభావం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారు

పాఠశాలలో అంకితభావం కలిగిన ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో ఉండి కృషి చేయడం వల్లే మంచి ఉత్తీర్ణతతో పాటు మండల ప్రథమ స్థానంలో పాఠశాల నిలిచిందన్నారు. విద్యార్థులను సొంత బిడ్డల వలే భావించి వారి అభిరుచికి తగినట్టుగా ప్రత్యేక తరగతులు నిర్వహించడం ద్వారానే ఉత్తమ ఫలితాలు సాధించగలిగామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులకు, సిబ్బందికి, దాతలకు, పూర్వ విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన మౌలిక వసతులను దాతలు అందిస్తున్న సహాయాన్ని తల్లిదండ్రులు తెలుసుకొని తమ పిల్లలను చేర్పించి ఉజ్వల భవిష్యత్తుకు మంచి పునాది వేయాలని తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా మంగళవారం ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా పరీక్షల కన్వీనర్ బి.ప్రభాకరరావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 27 పరీక్షా కేంద్రాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి 12 గంటల వరకు జరిగిన మొదటి సంవత్సరం గణితం బి, జంతు శాస్త్రం, చరిత్ర పరీక్షలకు మొత్తం 5,588 మందికి 5,279 మంది హాజరు కాగా 309 మంది గైర్హాజరయ్యారు. 94 శాతం హాజరు నమోదైంది. ఇందులో సాధారణ విద్యార్థులు 5,269 మందికి 4,992 మంది హాజరు కాగా 277 మంది గైర్హాజరయ్యారు. వృత్తి విద్య విభాగంలో 319 మందికి 287 మంది హాజరు కాగా 32 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి ఐదున్నర గంటల వరకు జరిగిన ద్వితీయ సంవత్సరం గణితం బి, జంతు శాస్త్రం, చరిత్ర పరీక్షలకు మొత్తం 1,147 మందికి 1,045 మంది హాజరు కాగా 102 మంది గైర్హాజరయ్యారు. 91 శాతం హాజరు నమోదైంది. సాధారణ విద్యార్థులు 997 మందికి 919 మంది హాజరు కాగా 78 మంది గైర్హాజరయ్యారు. వృత్తి విద్యా విభాగంలో 150 మందికి 126 మంది హాజరు కాగా 24 మంది గైర్హాజరయ్యారు.

ఘనంగా ఎన్‌టి.రామారావు జయంతి వేడుకలు

ప్రజాశక్తి - చాట్రాయి

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు 101వ జయంతి వేడుకలు మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు.బ చనుబండ సెంటర్‌లో ఎన్‌టిఆర్ విగ్రహానికి జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. చాట్రాయిలో జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవరెడ్డి ఆధ్వర్యంలో, చిన్నంపేటలో టిడిపి లీగల్ సెల్ అత్తునూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

ముసునూరు : నూజివీడు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నందమూరి తారకరామారావు విగ్రహానికి టిడిపి నూజివీడు ఎంఎల్ఎ అభ్యర్థి కొలుసు పార్థసారధి పూల మాల వేసి నివాళులర్పించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు, పార్టీ మండలాధ్యక్షులు ఢలరామ్, గద్దల సుహాసిని మోహన్‌రావు, రాపర్ల బాలకృష్ణ, రాపర్ల ప్రతాప్, మెదరమెట్ల సురేంద్ర, కాటేపల్లి సత్యనారాయణ, పాకనాటి సీతారామాంజనేయులు, గార్లపాటి నరసింహరావు పాల్గొన్నారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు నూజివీడులోని ఆయన కార్యాలయంలో ఎన్‌టిఆర్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కామవరపుకోట : కామవరపుకోటలో మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళీరామకృష్ణ ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు బాటసారులకు మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో కామవరపుకోట గ్రామ కమిటీ అధ్యక్షుడు వజీర్ ఖాన్, ఉపాధ్యక్షుడు కలిదిండి పుల్లంరాజు, మాజీ ఎంపిటిసి ఘంటా మాధవరావు, పరసా శ్రీనివాసరావు, కరిపోతు కృష్ణ, జాలపర్తి రాంబాబు, చింతపల్లి రాధాకృష్ణ, కొయ్యగూర వెంకటేష్ పాల్గొన్నారు.

కైకలూరు : కైకలూరులో నిర్వహించిన వేడుకల్లో మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి కమ్మిలి విఠల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతలపూడి : మండలంలోని ప్రగడవరంలో టిడిపి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు తాళ్లూరి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి సభ్యులు కనమతరెడ్డి రాజారెడ్డి, టిడిపి నాయకులు మానేపల్లి రాజారావు, కొమ్ము తిరుపతిరావు, మహాలక్ష్మడు, ఇశ్రాయేలు పాల్గొన్నారు. చింతలపూడిలోని టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బోడా నాగభూషణం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం చింతలపూడిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జగ్గవరపు ముత్తారెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కోండ్రు దేవా, ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్ కుమార్, జిల్లా రైతు కార్యదర్శి కొత్తపూడి శేషగిరిరావు పాల్గొన్నారు.

భీమడోలు : భీమడోలులోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆ పార్టీ ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు ముఖ్యఅతిథిగా హాజరై ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి సత్కరించారు.

ఆగిరిపల్లి : ఆగిరిపల్లి సగర్ల బజారులో టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు కొండా మంగయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎం.గోపాల్, వై.ప్రణీత్, నాగేశ్వరరావు, విక్టర్‌బాబు, రాంబాబు, నాగరాజు, ఆంజనేయులు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల : స్థానిక వైష్ణవి హోటల్‌లో, వైష్ణవి కల్యాణ మండపం వద్ద టిడిపి నాయకుడు ఇమ్మడి రత్నాజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బిసి సెల్ సెక్రటరీ కూరాకుల బుజ్జి యాదవ్, నియోజవర్గ వాణిజ్య సెల్ అధ్యక్షులు ఇమ్మడి రత్నాజీ, మండల బిసి సెల్ అధ్యక్షులు రేవూరి వెంకటేశ్వరరావు, కొరపాటి వెంకన్న, గువ్వల మావుళ్ల, గువ్వల నాగ చంద్రం, చిలుకూరి హరిబాబు, తాడేపల్లి సుబ్బారావు, పెద్దింటి నాగు పాల్గొన్నారు.

కలిదిండి : మండలంలోని మట్టగుంటలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి టిడిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన ఆధ్వర్యంలో 50 మంది వృద్ధ మహిళలకు, వితంతువులకు చీరలు పంపిణీ చేశారు. డిసి వైస్ ఛైర్మన్ నాగిడి వీరబ్రహ్మం, ఉపసర్పంచి కోకా సుజాత, తిరుమాని పాండురంగారావు, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, రాజనాల పరశురామ య్య, తిరుమలశెట్టి ఈశ్వర పరశురాముడు, కొపనాతి శంకరరావు పాల్గొన్నారు.

ముదినేపల్లి : పెదపాలపర్రు, ముదినేపల్లి, అల్లూరు, సింగరాయపాలెం, గురజ, వడాలి తదితర గ్రామాల్లో టిడిపి నాయకులు, ఎన్‌టిఆర్ అభిమానులు జయంతి వేడుకలు నిర్వహించారు. ఎన్‌టిఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కుక్కునూరు : కుక్కునూరులో టిడిపి మండలాధ్యక్షులు మొలిశెట్టి నాగేశ్వరరావు ఇంటి వద్ద టిడిపి కార్యకర్తలు, నాయకులు ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షులు మధుర వెంకటరమణ, కుక్కునూరు ఉపసర్పంచి పిచ్చుక రాజు, నాయకులు కోటగిరి సత్యనారాయణ, రమణ రాజు, మారేడుబాక ఎంపిటిసి ముప్పాల శివయ్య, మండల నాయకులు పులి క్షను, కుక్కునూరు మండల తెలుగు యువత అధ్యక్షులు బాలాజీ పాల్గొన్నారు.

టి.నరసాపురం : మండలంలోని తిరుమలదేవిపేట గ్రామ పంచాయతీలో రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వడ్డే శ్రీనివాస్, తోట వీరాస్వామినాయుడు, పండు, కాసగాని వీరాజు, మన్యం దుర్గారావు, తోట శ్రీను, కృష్ణమూర్తి, వీరబాబు, టిఎన్ఎస్ఎఫ్ సురేష్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి - పెదవేగి

ఉపాధి హామీ పని ప్రదేశాల్లో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి డిమాండ్ చేశారు. పెదవేగి మండలం నాగుల దేవిపేట గ్రామంలో ఉపాధి కూలీలతో ఆయన మంగళవారం మాట్లాడారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకొస్తే ఉపాధి హామీ చట్టం ప్రమాదంలో పడనుందని తెలిపారు. ఉపాధి హామీ కూలీలకు ప్రతి వారం పే స్లిప్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అవినీతికి పాల్పడుతున్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ చట్టం రక్షణ కోసం రానున్న కాలంలో చేసే ఆందోళన పోరాటాల్లో ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, మండల నాయకులు వెంకటేశ్వర్లు, రాజేష్ పాల్గొన్నారు.

అటవీ సంపద అన్యాక్రాంతం కాకుండా చూడాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అటవీ సంపదను అన్యాక్రాంతం కాకుండా చూడాలని సబ్ డిఎఫ్ఒ వెంకటసుబ్బయ్య తెలిపారు. మండలంలోని రామన్నపాలెం విఎస్ఎస్, కామయ్యపాలెం బీట్‌లలో రెండేళ్ల క్రితం నాటిన మారుజాతి ప్లాంటేషన్లను ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎస్‌కె.వలీతో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కల పెరుగుదలకు అవసరమైన తగు సూచనలు చేశారు. అనంతరం జీలుగుమిల్లిలో ఉన్న అటవీ శాఖ తనిఖీ కేంద్రాన్ని సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ అధికారి దినేష్, బీట్ అధికారులు మారేష్, భవాని, యేసుపండు, అటవీ శాఖ సిబ్బంది రాఘవులు పాల్గొన్నారు.

బాలికా విద్యాభివృద్ధికి ప్రేమకుమార్ కృషి

ప్రజాశక్తి - భీమడోలు

బాలికా విద్యాభివృద్ధికి మాంటిస్సోరి విద్యాసంస్థల అధినేత కె.ప్రేమకుమార్ చేస్తున్న కృషి అభినందనీయమని ప్రముఖ రాజకీయ నాయకులు గన్ని వీరాంజనేయులు అన్నారు. విద్యాసంస్థ ఆధ్వర్యంలో భీమడోలులో బాలికల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శ్రీ మాధురి జూనియర్ కళాశాలను ఆయన మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాంటిస్సోరి విద్యాసంస్థల అధినేత భీమడోలుతో పాటు తమ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలో కొనసాగుతున్న కళాశాలలు, వాటి ద్వారా విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు అందిస్తున్న సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాలకు చెందిన పలువురు అధ్యాపకులు, సిబ్బందితోపాటు పలువురు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మృతురాలి అంత్యక్రియల ఖర్చులకు అమరావతి మాజీ బ్రాండ్ అంబాసిడర్, వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవి మంగళవారం ఆర్థిక సాయం అందించారు. ముదినేపల్లిలోని అంబేద్కర్ కాలనీకి చెందిన నిరుపేద వృద్ధురాలు నడ్డి తిలకమ్మ (75) మంగళవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న అంబుల వైష్ణవి తన తండ్రి ప్రముఖ వైద్యులు మనోజ్‌తో కలిసి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మృతురాలి అంత్య క్రియలకు రూ.ఐదు వేల ఆర్థిక సాయం అందించారు.

'బెదిరింపులు సరికావు'

ప్రజాశక్తి - నిడమర్రు

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఒక రాజకీయ పార్టీ నాయకులు ప్రజల హక్కులకు భంగం కలిగే పద్ధతుల్లో భయభ్రాంతులకు గురి చేస్తూ వ్యవహరించారని సిపిఎం నాయకులు అన్నారు. ప్రజలకు ఇష్టమైన పార్టీ జెండాలు పట్టుకొని ప్రచారం చేసుకుంటుంటే ఎన్నికలు అయిన తర్వాత మీ సంగతి చూస్తామని కొన్ని కుటుంబాలను బెదిరించడం సరికాదన్నారు. నిడమర్రు ప్రజా సంఘాల కార్యాలయంలో సిపిఎం సమావేశం కోన శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణారావు మాట్లాడుతూ దుష్ట రాజకీయ సంప్రదాయాలని అరికట్టాలని కోరారు. అనంరతం నిడమర్రు తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వెలగలేటి మోహన, గవర సత్యనారాయణ, లావేటి చంద్రరావు, కానూరు రాజు, కంచ వరప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
విలేకరులు కావలెను
మీరు జర్నలిస్టు కాదలచుకున్నారా?
మీకు సామాజిక స్పృహ ఉన్నదా?
విన్నదీ కన్నదీ పది మందితో పంచుకుందామనుకుంటున్నారా?
ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు ఈ క్రింది కేంద్రాల్లో ఆసక్తి గల విలేకరులు కావలెను
నూజివీడు, తాడేపల్లిగూడెం టౌన్, భీమవరం అర్బన్, కైకలూరు టౌన్
విలేకర్లు కావలసిన రూరల్ కేంద్రాలు
వేలేరుపాడు, లింగపాలెం, పెదవేగి, దెందులూరు, పెదపాడు, నిడమర్రు, గుడివాకలంక (ఏలూరు), భీమవరం, నరసాపురం, అత్తిలి, ఇరగవరం, పెంటపాడు, కైకలూరు, జంగారెడ్డిగూడెం, మొగల్తూరు
విలేకర్లకు అర్హత: ఇంటర్ ఉత్తీర్ణత, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
ఆఫీసు చిరునామా: ప్రజాశక్తి కార్యాలయం, బొలుసువారి వీధి, ఏలూరు టైమ్స్ కార్యాలయం సమీపంలో, పవర్‌పేట, ఏలూరు-2
ఆసక్తి గలవారు పూర్తి వివరాలతో బయోడేటాను మెయిల్ చేయాలి
wgpraja@gmail.com
సంప్రదించాల్సిన నెంబర్లు: 99493 66196, 89191 70815, 94900 99168